క్లుప్తంగా

చిరు వ్యాపారులకు ఉపాధి భద్రత కల్పించాలి

పొదిలి: ప్రధాన రహదారి సైడు కాలువల ఆక్రమణల తొలగింపులో ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఉపాధి భద్రత కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.రమేష్ ఒక ప్రకటనలో కోరారు. ఆక్రమణల తొలగింపుతో తోపుడు బండ్ల వారు, బంకులు పెట్టుకుని జీవనం సాగించే వారు, చిరు వ్యాపారులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. సైడు కాలువల్లో పూడికతీత తర్వాత దుకాణాల్లోకి వెళ్లే అవకాశం లేకుండా పోయిందన్నారు. దీంతో వేల రూపాయల అద్దె చెల్లించే వ్యాపారులు నష్టపోతున్నారని చెప్పారు. నగర పంచాయతీ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే బాధితులతో కలిసి ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

తర్లుపాడు సర్వేయర్‌గా శ్రీవాణి


శ్రీవాణి

తర్లుపాడు: మండల సర్వేయర్‌గా వై.శ్రీవాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ సచివాలయ సర్వేయర్లు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

పొదిలి డీటీగా షాజిదా


షాజిదా

పొదిలి: పొదిలి డిప్యూటీ తహసీల్దార్‌గా శుక్రవారం షాజిదా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. పొదిలి సివిల్ సప్లయిస్ డీటీగా పని చేస్తూ, ఎన్నికలకు ముందు కొనకనమిట్ల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బదిలీ అయిన ఆమె.. తిరిగి పొదిలి డీటీగా బాధ్యతలు చేపట్టారు. షాజిదాను పలువురు రెవెన్యూ ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అనాథాశ్రమంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న పూర్వ విద్యార్థులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పీఆర్ కాలనీలో ఉన్న సంజీవని అనాథాశ్రమంలో వృద్ధులు, చిన్నారులకు శ్రీవివేకానంద కళాశాలలో 1983–84, 1985 బ్యాచ్ డిగ్రీ పూర్వ విద్యార్థులు శుక్రవారం అన్నదానం చేశారు. దాతలకు ఆశ్రమ నిర్వాహకుడు రాజశేఖర్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గోపాల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


తాళం వేసి ఉన్న మరుగుదొడ్లు


నాణ్యత లేని ఇసుక

మార్కాపూర్ స్టేషన్‌లో సమస్యల కూత

- సక్రమంగా లేని మౌలిక వసతులు
- నిత్యం ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- నత్తనడకన సాగుతున్న అభివృద్ధి పనులు


మార్కాపురం రైల్వేస్టేషన్

మార్కాపురం రూరల్:

పశ్చిమ ప్రకాశంలో కీలకమైన మార్కాపురం రైల్వే స్టేషన్‌లో సమస్యలు కూత పెడుతున్నాయి. రోజూ వేలాది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసే ఈ స్టేషన్‌కు ఆదాయం బాగానే ఉన్నప్పటికీ అంతే స్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. స్టేషన్ అభివృద్ధిని గుంటూరు రైల్వే డివిజన్ అధికారులు గాలికొదిలేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమృత్ పథకంలో నిధులు వచ్చినప్పటికీ పూర్తి స్థాయిలో ఖర్చు చేయలేదు. దీంతో ఈ స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. 2014–19 మధ్య వైవీ సుబ్బారెడ్డి ఒంగోలు ఎంపీగా ఉన్నప్పుడు రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రత్యేక నిధులు కేటాయించడంతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ తర్వాత నిధులు లేకపోవడంతో మార్కాపురం రోడ్ రైల్వేస్టేషన్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. రోజూ మార్కాపురం మీదుగా సుమారు 20 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ముఖ్యంగా హుబ్లీ, తిరుపతి, ప్రశాంతి, అమరావతి, ధర్మవరం, వాస్కోడిగామా, డోన్, కాచిగూడ తదితర రైళ్లు ఈ స్టేషన్ మీదుగానే వెళ్తాయి.

పట్టీపట్టనట్టుగా రైల్వే అధికారులు

రైల్వేస్టేషన్ ఆవరణలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. నూతనంగా నిర్మిస్తున్న కాంక్రీట్ పనుల్లో నాణ్యత లోపించింది. మంచి ఇసుక వాడాల్సి ఉండగా స్థానికంగా గుండ్లకమ్మలో లభ్యమయ్యే నాసిరకం ఎర్ర ఇసుకను వినియోగిస్తున్నారు. ఈ విషయం తెలిసినప్పటికీ రైల్వే అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

సమస్యల చిట్టా..

- రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛమైన తాగునీరు లేకపోవడంతో ప్రయాణికులు మినరల్ వాటర్ బాటిల్స్ కొనుగోలు చేయాల్సి వస్తోంది.
- మరుగుదొడ్లు వినియోగంలో లేవు. వాటిని కడిగేందుకు కూడా నీటి సౌకర్యం లేక వదిలేశారు.
- నాణ్యమైన ఫుడ్‌ను వెండర్లు అమ్మడం లేదు. దీంతో ప్రయాణీకులు ఆహార పదార్థాల ఏజెన్సీలో బుక్ చేసుకోవాల్సిన దుస్థితి. ప్రైవేట్ వెండర్ల ఆధిపత్యం ఎక్కువగా ఉంది.
- డిజిటల్ బోర్డులు లేకపోవడంతో ఎక్కడ బోగీ ఆగుతుందో తెలియక ప్రయాణికులు రైలు వచ్చే సమయంలో ప్లాట్‌ఫాంపై పరుగెత్తాల్సి వస్తోంది.
- టూ వీలర్స్ పార్శిల్ బుక్ చేసినప్పుడు నిర్ణీత మొత్తం కంటే అధిక మొత్తంలో వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు.

మేమింతే... మారమంతే..

రైల్వేస్టేషన్ నుంచి మార్కాపురం పట్టణంలోకి ప్రయాణికులు రాత్రి పూట రావాలంటే జేబులు గుల్ల కావాల్సిందే. ఆటోవాలాలు కనీసం రూ.200, మరోమాట మాట్లాడితే రూ.300ను ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. గతంలో ఇదే విషయమై ఆటోవాలాలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా పరిస్థితిలో మార్పు రాలేదు. కొందరు ఆటో డ్రైవర్లు మద్యం సేవించి ఆటోలు నడుపుతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.


పనిచేయని తాగునీటి కుళాయిలు

సమస్యలు నా దృష్టికి రాలేదు

రైల్వే స్టేషన్‌లో మరుగుదొడ్లను వినియోగించుకోకుండా తాళాలు వేసి ఉన్నాయనే విషయం, మంచినీరు, ఇతర సమస్యలున్నాయనే విషయం నా దృష్టికి రాలేదు. ఆ సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు కృషి చేస్తా.

– జనార్దనరావు, రైల్వేస్టేషన్ మాస్టర్

ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలి



రాత్రి సమయాల్లో అధిక ధరలు వసూలు చేస్తున్న ఆటో డ్రైవర్లపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణించేలా చూడాలి.

– ఎస్.నరసింహాచార్యులు, ప్రయాణికుల సంఘ నాయకులు

రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి



స్టేషన్‌లో అభివృద్ధి పనులను జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలి. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపం లేకుండా చూడాలి. రైల్వే స్టేషన్‌లో కోచ్ ఇండికేషన్ బోర్డును ఏర్పాటు చేసి, హమాలీలను పెంచాలి. మంచినీటి సౌకర్యం కల్పించడంతోపాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి.

– ఓరుగంటి మల్లిక్, ప్రయాణికుల సంఘం జిల్లా అధ్యక్షుడు

బూచేపల్లి ప్రమాణ స్వీకారానికి

తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు


అన్నా రాంబాబు ఆధ్వర్యంలో ఒంగోలు వెళ్లిన పార్టీ నాయకులు

మార్కాపురం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఒంగోలు తరలివెళ్లారు. పార్టీ కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలని, ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నా రాంబాబు సూచించారు. ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ సీహెచ్ బాలమురళీకృష్ణ, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, బీసీ సంఘ జాతీయ కార్యదర్శి పీఎల్పీ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ 2 అంజమ్మ శ్రీనివాసులు, తర్లుపాడు ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రంగారెడ్డి, నల్లబోతుల కొండయ్యతోపాటు పొదిలి, కొనకనమిట్ల, తర్లుపాడు మండలాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒంగోలు వెళ్లారు.


కంభం నుంచి ఒంగోలు వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కంభం నుంచి తరలిన నాయకులు

కంభం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కంభం మండల వైఎస్సార్ సీపీ నాయకులు తరలివెళ్లారు. మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ నెమలిదిన్నె చెన్నరెడ్డి, సర్పంచులు రసూల్, పెద్దకోటేశ్వరరావు, సూర్యప్రకాష్, ఎంపీటీసీలు ఆనంద్, పాలగిరి శర భారెడ్డి, తెల్లక్రిష్టారెడ్డి, హుస్సేన్ బాష, తెల్లకృష్ణారెడ్డి, గురుమూర్తి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే జైలుకే..



మాట్లాడుతున్న ఎస్సై అనీల్‌కుమార్

మార్కాపురం: విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని, ర్యాగింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని పెద్దారవీడు ఎస్సై పి.అనీల్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కిట్స్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. ర్యాగింగ్‌కు పాల్పడి కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలు రావని, విదేశాలకు వెళ్లలేరని, ఉన్నత చదువులు చదవలేరని హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని హితబోధ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఏఓ ప్రభాకర్, హెచ్ఓడీలు కిశోర్‌బాబు, రాముడు, అనీల్‌కుమార్, ప్రసన్న మురళీ, అమృతవల్లి తదితరులు పాల్గొన్నారు.

9 వరకు మద్యం దుకాణాల దరఖాస్తు గడువు


వివరాలు వెల్లడిస్తున్న ఏఈఎస్ బాలయ్య

మార్కాపురం: మార్కాపురం ఎక్సైజ్ ఏఈఎస్ పరిధిలోని 68 మద్యం షాపులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని ఏఈఎస్ దాసరి బాలయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆలయ మాట్లాడారు. మార్కాపురం పరిధిలో 13, యర్రగొండపాలెం 13, గిద్దలూరు 13, కంభం 10, కనిగిరిలో 19 షాపులకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. వీటిలో రూ.55 లక్షల శ్లాబ్‌లో 24 షాపులు, రూ.65 లక్షల శ్లాబులో 44 షాపులు ఉన్నాయని వివరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ మోడల్‌లో 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. మార్కాపురం పట్టణంలో 4, కనిగిరి, గిద్దలూరుల్లో ఒక్కో బార్ అండ్ రెస్టారెంట్ ఉన్నట్లు చెప్పారు. ప్రెస్‌మీట్‌లో మార్కాపురం సీఐ ముక్కు వెంకటరెడ్డి, స్క్వాడ్ సీఐ గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్

కొనకనమిట్ల: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఫ్రీహోల్డ్ ఆఫ్ అసైన్‌మెంట్ భూముల జాబితాను కూటమి సర్కారు ఆదేశాల మేరకు అధికారులు తనిఖీ చేశారు. శుక్రవారం కొనకనమిట్ల తహసీల్దార్ కార్యాలయంలో అసైన్‌మెంట్ భూముల జాబితాను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సువర్ణమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 12750 ఎకరాల ఫ్రీ హోల్డ్ భూములు ఉన్నాయన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక బృందాలతో వెరిఫికేషన్ చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. తనిఖీలో తహసీల్దార్ ఆవుల సురేష్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

మెడికల్ షాపులో కాలం చెల్లిన మందుల విక్రయం


కాలం చెల్లిన మందు సీసా చూపిస్తున్న బాధితుడు


కంభం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ మెడికల్ షాపులో అర్బన్ కాలనీకి చెందిన నదీమ్ అనే యువకుడు పిల్లలకు దగ్గు, జలుబు సిరప్ తీసుకెళ్లాడు. ఇంటికి వెళ్లి కుమారుడికి సిరప్ వెయ్యడం కోసం మూత తీస్తూ ఎక్స్‌పైరీ డేట్ గమనించాడు. గడువు ముగిసి మూడు నెలలైందని గుర్తించి దుకాణం వద్దకు వెళ్లి యజమానిని నిలదీయడంతో నీళ్లు నమిలాడు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశాడు.


గిద్దలూరు : గాయత్రి ఆలయంలో అమ్మవారు

అన్నపూర్ణా పాహిమాం..


భువనేశ్వరీదేవిగా వాసవీమాత


అంబ భవానీదేవిగా కోటసత్యమాంబదేవిర్


గొట్లగట్టు రామాలయంలో..


పొదిలి : కౌమార దేవి అలంకారంలో అమ్మవారు


కంభంలో అన్నపూర్ణదేవిగా అమ్మవారు


మార్కాపురంలో ఆదిలక్ష్మి అలంకారంలో రాజ్యలక్ష్మి అమ్మవారు


సరస్వతీదేవి అలంకారంలో జగదాంబ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో వేడుకగా సాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం ఆలయాల్లో అమ్మవారి మూలవిగ్రహమూర్తులను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

- వేడుకగా నవరాత్రి ఉత్సవాలు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు రామాలయం, పెదారికట్ల మహాలక్ష్మమ్మ ఆలయం, శివాలయం, కొనకనమిట్ల రామదూతక్షేత్రం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

కంభంలో అన్నపూర్ణదేవిగా

కంభం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం అమ్మవారు భక్తులకు అన్నపూర్ణ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం కళశంతో పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు.

ధనలక్ష్మి అలంకారంలో..

గిద్దలూరు రూరల్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మిగా, నల్లబండ బజారులోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు బాలాత్రిపురసుందరిదేవిగా, కాశినాయన కుంట ఆవరణలోని గాయత్రిమాత ఆలయంలో గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వీరన్నబావి సమీపంలో గల కాళికాంబ ఆలయంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

భువనేశ్వరీదేవిగా వాసవీమాత

బేస్తవారిపేట: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు భువనేశ్వరీదేవిగా, కోటసత్యమాంబదేవి ఆలయంలో అంబ భవానీదేవిగా దర్శనమిచ్చారు. పాపాయిపల్లె, బేస్తవారిపేట పోలేరమ్మ ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలతో నిత్యపూజలు, మంగళహారతి పూజలు నిర్వహించారు.

కౌమారదేవిగా వాసవీ మాత

పొదిలి: స్థానిక శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు కౌమార దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శాశ్వత, పుష్పాలంకరణ ఉభయదాతలతో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జీసీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి వేమా కృష్ణమూర్తి, కోశాధికారి కంకణాల రమేష్, యక్కలి శేషగిరిరావు, మేడా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రాచర్ల: స్థానిక రామాలయంలో అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించి పూజలు చేశారు. కుంకుమ పూజలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మార్కాపురం టౌన్: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత సావిత్రి అలంకారంలో, చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు ఆదిలక్ష్మిగా, శివాలయంలో జగదాంబ అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ మాత ఆలయ కమిటీ అధ్యక్ష్య కార్యదర్శులు సీహెచ్ బాలమురళీకృష్ణ, ఎస్వీ సుబ్బారావు, కోశాధికారి ఆర్‌వీ రమేష్, శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఈవో శ్రీనివాసరెడ్డి, శివాలయంలో ఈవో చెన్నకేశవరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజరాజేశ్వరిదేవిగా..

కొమరోలు: స్థానిక వాసవీ మాత ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమార్చన, మంగళ హారతి నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపెంట వెంకటరమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రాచర్ల : గాయత్రీదేవి అలంకారంలో..


పెదారికట్ల శివాలయంలో..

9 నుంచి దసరా ప్రత్యేక సర్వీసులు


బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందుల, పక్కన డీఎం

మార్కాపురం టౌన్: మార్కాపురం ఆర్టీసీ డిపో పరిధిలో నూతనంగా రెండు ఇంద్ర బస్సులను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ బస్సులను మార్కాపురం నుంచి హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌కు నడపనున్నట్లు డీఎం నరసింహులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ కామేశ్వరి, ఏడీఏ సత్యనారాయణ, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పండుగకు ప్రత్యేక సర్వీసులు

దసరా పండుగను పురస్కరించుకుని ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు, అలాగే పండగ అయిపోయిన మరుసటి రోజు నుంచి హైదరాబాద్, విజయవాడకు ప్రత్యేక సర్వీసులు నడపుతున్నామని డిపో మేనేజర్ నరసింహులు తెలిపారు. హైదరాబాద్‌కు 4 సర్వీసులు ప్రత్యేకంగా తిప్పుతున్నట్లు చెప్పారు. డిమాండ్‌ను బట్టి విజయవాడకు కూడా ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. మార్కాపురం ఆర్టీసీ పరిధిలో ఈనెల 5, 6వ తేదీల్లో విద్యార్థులు, ప్రయాణికులు బస్‌పాస్‌ల కోసం రావద్దని డీఎం చెప్పారు. ఆర్టీసీ సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్‌లో భాగంగా రెండు రోజులు ఆన్‌లైన్ పనిచేయదని తెలిపారు. 7వ తేదీ నుంచి సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

చెరువులో ఆక్రమణల తొలగింపు


జేసీబీతో ఇళ్లు కూలగొడుతున్న దృశ్యం

మార్కాపురం: మార్కాపురం చెరువులో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం డ్రైవర్స్ కాలనీ సమీపంలోని అలుగును ఆక్రమించి కట్టిన రెండు ఇళ్లను జేసీబీతో కూల్చివేశారు. ఉన్నపళంగా గృహాలు కూలగొడితే తాము ఎక్కడ బతకాలని అధికారులను బాధిత కుటుంబాల వారు ప్రశ్నించారు. తమకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొమరోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్‌వలి తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ శాఖల పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.